క్లుప్తంగా

సీసీ కెమెరాల వితరణ



వర్ని: మండలంలోని జలాల్పూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు గ్రామంలోని యువకులు సీసీ కెమెరాలు వితరణ చేశారు. మంగళవారం 4 సీసీ కెమెరాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు రత్నాకర్‌కు అందజేశారు. గ్రామానికి చెందిన సింగంపల్లి సురేందర్, మాజీ ఎంపీటీసీ సాయి గౌడ్, నరెడ్ల బాలు, గోవర్ధన్, ముద్దే గంగాధర్, వీరప్ప, రామకష్ణ పాల్గొన్నారు.

ధ్యానం సర్వరోగ నివారిణి



రుద్రూర్: ధ్యానం వల్ల పలు రోగాల నుంచి సంపూర్ణ విముక్తి పొందవచ్చునని పిరమిడ్ మాస్టర్ నీలిమ అన్నారు. కోటగిరి మండల కేంద్రంలోని చావిడి గల్లీ హన్మాన్ మందిరం వద్ద మంగళవారం బోధన్ సావిత్రి దేవి పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో ధ్యానంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మానసిక ప్రశాంతత కలుగుతుందని, సరైన నిర్ణయాలు తీసుకునే శక్తి పెంపొందుతుందని వివరించారు.

ఎల్‌వోసీ అందజేత

బాల్కొండ: నాగాపూర్ గ్రామానికి చెందిన తంబూరి మల్లేశ్ కొంత కాలంగా చేతి నరాల వ్యాధితో బాధపడుతున్నారు. ఆపరేషన్‌కు లక్ష రూపాయాల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలపడంతో స్థానిక కాంగ్రెస్ నేతలు ఆశ్రయించారు. ఈ విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ప్రభుత్వం నుంచి రూ.లక్ష ఎల్‌వోసీ ఇప్పించారు. ఎల్‌వోసీ లెటర్‌ను మంగళవారం బాధితుడికి అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రైసైకిల్ ..



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అమ్దాపూర్ గ్రామానికి చెందిన మేకల మోహన్‌కు ఆర్‌ఆర్ ఫౌండేషన్ డైరెక్టర్ పైడి సుచరితా రెడ్డి మంగళవారం ట్రై సైకిల్ అందజేశారు. అమ్దాపూర్ గ్రామానికి చెందిన మోహన్ అంగ వైకల్యంతో ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకున్న సుచరితా రెడ్డి, ఫౌండేషన్ ద్వారా ట్రై సైకిల్ అందించారు. ఫౌండేషన్ సభ్యులు విజయ్ రెడ్డి, గంగా రెడ్డి, సుమన్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ అనాథాశ్రమానికి ఇన్వర్టర్ బ్యాటరీ విరాళం




రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని అమ్మ అనాథాశ్రమానికి తాటి సాయిరాం, తాటి సంతోష్‌లు వాళ్ల తాత తాటి రాములు జ్ఞాపకార్థం ఇన్వర్టర్ బ్యాటరీని విరాళంగా అందజేశారు. అనాథ పిల్లలను చేరదీసి ఆశ్రయం కల్పిస్తున్న నిర్వాహకులను వారు అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హంగర్గ స్వరూప గంగాధర్, తాటి సాధన సత్యనారాయణ, ఆర్మీ జవాన్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలో మంగళవారం డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఎన్‌ఆర్‌జీఎస్ నిధులతో గ్రామంలో చేపడుతున్న పనులను తహసీల్దార్ నరేశ్, ఈవో రాజలింగం ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ ఆలూర్ మండల అధ్యక్షుడు కొత్తూరు గిరీశ్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు నడిసరం మల్లయ్య, మండల కార్యదర్శి అర్ష హరీశ్, దండు మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



బాల్కొండ: మెండోరా మండలంలోని పలు గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులను మంగళవారం ఎంపీపీ సుకన్య, జెడ్పీటీసీ తలారి గంగాధర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆడబిడ్డల సంక్షేమం కోసం మాజీ సీఎం కేసీఆర్ కల్యాణ లక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. 30 మంది చెక్కులు అందించారు. తహసీల్దార్ సంతోష్, ఎంపీడీవో వనజ, ఆర్ఐ సాయన్న పాల్గొన్నారు.

ముందుకురాని కాంట్రాక్టర్లు

- డొంకేశ్వర్ మండలంలో ప్రారంభం కాని సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులు
- ఉపాధిహామీ కింద 13 గ్రామాలకు రూ.40 లక్షలు మంజూరు
- కాంట్రాక్టర్ల కోసం అన్వేషణ



డొంకేశ్వర్(ఆర్మూర్): గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలను నిర్మించడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఉపాధిహామీ బడ్జెట్ కావడంతో బిల్లులు త్వరగా రావనే ఉద్దేశంతో వెనకడుగు వేస్తున్నారు. దీంతో డొంకేశ్వర్ మండలంలో ఏ గ్రామంలో కూడా పనులు మొదలు కాలేదు. కాంట్రాక్టర్ల కోసం పంచాయతీరాజ్ శాఖ అధికారులు వెతుకులాడుతున్నారు. పల్లెల్లో మట్టి రోడ్లను సీసీ రోడ్లుగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఆయా గ్రామాల్లో పనులను గుర్తించిన అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. కానీ ప్రభుత్వం కొన్ని పనులకే ఆమోదం తెలిపి నెల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. 13 గ్రామాలకు కలిపి మొత్తం రూ.40లక్షల నిధులను విడుదల చేసింది. అత్యధికంగా డొంకేశ్వర్ మండల కేంద్రానికి రూ.5 లక్షలు కేటాయించారు. ఐతే, సీసీ రోడ్లు, డ్రైనేజీల పనులు టెండరు పద్ధతిలో కాకుండా నామినేషన్ పద్ధతిలోనే చేయాలనే నిబంధనలు ఉన్నాయి. దీంతో పనులు మొత్తం పూర్తి చేసిన తర్వాతే కాంట్రాక్టర్‌కు బిల్లులు రానున్నాయి. ఎంబీ రికార్డులు, బిల్లులు అధికారులకు సమర్పిస్తే పనికి సంబంధించిన నిధులు జీపీ ఖాతాలో జమవుతాయి. జీపీ ఖాతా నుంచి కాంట్రాక్టర్ ఖాతాలోకి పంపుతారు. ఎన్‌ఆర్ ఈజీఎస్ పనులు కావడంతో బిల్లులు ఆలస్యమవుతాయని కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. బిల్లులు త్వరగా ఇప్పిస్తామని అధికారులు చెప్పినా కూడా కాంట్రాక్టర్లు ససేమిరా అంటున్నారు. ఈ నెల మార్చితో ఆర్థిక సంవత్సరం ముగియనుండడంతో ఎలాగైనా పనులు మొదలు పెట్టించడానికి అధికారులు తంటాలు పడుతున్నారు.

గ్రామాల వారీగా మంజూరైన నిధులు..

గ్రామం	నిధులు(రూ. లక్షల్లో)	గ్రామం	నిధులు(రూ. లక్షల్లో)
డొంకేశ్వర్	5	గంగాసముందర్	3
అన్నారం	3	కోమట్‌పల్లి	2
చిన్నయానం	2	మారంపల్లి	3
దత్తాపూర్	3	నికాల్‌పూర్	3
జీజీ నడ్కుడ	3	నూత్‌పల్లి	4
గాదేపల్లి	3	సిర్పూర్	3
		తొండాకూర్	3

కాంట్రాక్టర్లను వెతుకుతున్నాం

కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతోనే మండలంలో ఎక్కడ కూడా పనులు మొదలు కాలేదు. పని చేసే కాంట్రాక్టర్ల కోసం వెతుకుతున్నాం. పనులు పూర్తి చేసిన వెంటనే బిల్లులు వచ్చేలా చూస్తామని వారికి చెప్పి సముదాయిస్తున్నాం. త్వరలోనే సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటాం.

– బాలాజీ, ఏఈ, పంచాయతీరాజ్

ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాలు షురూ..!

సాక్షి ఎఫెక్ట్..



బాల్కొండ: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో కొంత కాలంగా ప్రసవాలు నిలిపేశారు. దీంతో సాక్షి దిన పత్రిక మంగళవారం 'బాల్కొండలో నిలిచిన ప్రసవాలు' అనే శీర్షికన వార్తా కథనం ప్రచురించింది. దీంతో స్పందించిన అధికారులు ప్రసవాలు ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టారు. మంగళవారం ముగ్గురు గర్భిణులకు వైద్యులు ఆపరేషన్లు చేసి ప్రసవాలు చేశారు. భీంగల్ పట్టణ ప్రభుత్వాస్పత్రి నుంచి డిప్యూటేషన్‌పై వైద్యులను నియమించి ఆపరేషన్లు చేయించారు. ఇక నుంచి ప్రతి మంగళవారం, గురువారం ఆస్పత్రిలో ప్రసవాల కోసం ఆపరేషన్లు నిర్వహిస్తామని వైద్యులు తెలిపారు.

మున్సిపల్ తైబజార్ వేలం



వేలం పాట నిర్వహిస్తున్న డీఈఈ శివానందం

బోధన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్, డీఈఈ శివానందం పట్టణ తైబజార్, స్లాటర్ హౌజ్ వేలం పాట నిర్వహించారు. తైబజార్ వేలంపాటలో 24 మంది ఔత్సాహికులు పాల్గొనగా, కబీర్ హైమద్ అనే వ్యక్తి రూ.21 లక్షల 30 వేలకు పట్టణ తైబజార్ కాంట్రాక్టును దక్కించుకున్నట్లు ఇన్‌చార్జి కమిషనర్ తెలిపారు. స్లాటర్ హౌజ్ వేలంపాటలో 11 మంది హాజరై కాంట్రాక్టు దక్కించుకునేందుకు పోటీ పడ్డారని, కాని నిర్దేశిత ధర రాకపోవడంతో ఆ వేలంపాటను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. మున్సిపల్ మేనేజర్ నరేందర్, ఆర్‌వో నియాజ్ పాల్గొన్నారు.

చేపూర్ పాఠశాలలో మాక్ పోలింగ్



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అభ్యంతరాలు, ఉప సంహరణ, తుది అభ్యర్థుల జాబితా, గుర్తుల కేటాయింపు, పోలింగ్ కంపార్ట్‌మెంట్ తయారు చేసి ఎన్నికలు నిర్వహించారు. రిటర్నింగ్ ఆఫీసర్‌గా లహరి, ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా ప్రియదర్శిని, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా సన్నిహిత, పోలింగ్ ఆఫీసర్‌గా రిశ్విత వ్యవహరించారు. అనంతరం అభ్యర్థులకు ఎన్నికలు నిర్వహించి ఫలితాలను ప్రకటించారు. అలాగే గెలిచిన అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎం చేతన కుమారి అభినందించారు.

సంతృప్తికరంగా ఉపాధి హామీ పనులు



మాట్లాడుతున్న డీఆర్‌డీవో సాయాగౌడ్

వేల్పూర్: వేల్పూర్ మండలంలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులు సంతృప్తికరంగా ఉన్నాయని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సాయాగౌడ్ పేర్కొన్నారు. వేల్పూర్ మండల పరిషత్ ఆవరణలో మంగళవారం 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీలో పనులు కూలీలకు పని కల్పించే విధంగా ఉండాలన్నారు. గత ఏడాది ఉపాధిహామీలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ నివేదిక సమర్పించారు. సమావేశంలో జిల్లా విజిలెన్స్ అధికారి నారాయణ, ఎంపీడీవో బాలకిషన్, ఏపీవో అశోక్, ఎస్‌ఆర్పీలు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం ప్రారంభం



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

మాక్లూర్: దుర్గానగర్‌కింది తండాలో మంగళవారం దాస్‌నగర్ తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రోగ్రాం యూనిట్ అధికారి డాక్టర్ ఎం సరిత ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం ప్రారంభించారు. ముందుగా గ్రామంలో పచ్చదనం పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ పంచాయతీ భవనం వద్ద జరిగిన సమావేశంలో ప్రిన్సిపల్ లావణ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇప్పటికీ కొన్ని తండాల్లో మూఢనమ్మకాలను వీడకపోవటం విచారకరమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మమ్మ, పంచాయతీ కార్యదర్శి ఎస్ స్వాతి, డి సుమలత, పి శ్వేత, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

నృత్యోత్సవంలో చిన్నారుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

పెర్కిట్(ఆర్మూర్): కామారెడ్డి జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి సనాతన సంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్యోత్సవంలో ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి నటరాజ నృత్యానికేతన్‌కు చెందిన చిన్నారులు ప్రతిభ కనబరిచినట్లు నాట్య గురువు మృణాళిని తెలిపారు. చిన్నారులు ప్రతిభ కనబరిచి మహానంది పురస్కారాలతో పాటు ప్రశంసా పత్రాలను అందుకున్నట్లు చెప్పారు. అలాగే మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలంలో నిర్వహించే వేడుకలకు ఆహ్వానం లభించినట్లు నటరాజ నృత్యానికేతన్ వ్యవస్థాపకుడు మాడవేటి నారాయణ, నాట్య గురువు మృణాళిని తెలిపారు.

కాలువల్లో పూడికతీత

సాక్షి ఎఫెక్ట్..



హైదర్ కుంటకు నీరు వచ్చే కాలువలో పూడిక తీస్తున్న ఉపాధి కూలీలు

బాల్కొండ: మండల కేంద్రం శివారులోని హైదరకుంటకు నీరు వచ్చే కాలువలను కబ్జా చేయడం వల్ల హైదర్‌కుంట చుక్క నీరు లేకుండా వెలవెలబోతోంది. దీంతో సాక్షి దిన పత్రిక గత నెల 3న 'కబ్జా కోరల్లో హైదర్ కుంట' అనే శీర్షికన వార్తా కథనం ప్రచురించింది. స్పందించిన అధికారులు కబ్జాకు గురైన కాలువలను యంత్రాలతో తవ్వించారు. కాలువల్లో ఉన్న పిచ్చి మొక్కలు, పూడిక తీయటానికి ఉపాధి కూలీలను నియమించారు. దీంతో ప్రస్తుతం హైదర్ కుంటలోకి నీరు వచ్చి చేరుతుంది. సుమారు 120 ఎకరాలకు సాగు, తాగు నీరు అందుతుంది. ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తెయూలో జాతీయ సదస్సు



సదస్సులో పాల్గొన్న ప్రముఖ కవులు

నిజామాబాద్ రూరల్: 'తెలుగు ప్రాచీన శాస్త్ర కావ్యాలు, లక్షణ గ్రంథాలు – సమాలోచన' అనే అంశంపై తెలంగాణ యూనివర్సిటీ తెలుగు అధ్యయన శాఖ, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం నెల్లూరు, భారతీయ భాషా సంస్థ మైసూర్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ సదస్సు ప్రారంభమైంది. మంగళవారం ప్రారంభమైన సదస్సు రెండు రోజులపాటు కొనసాగనుంది. తెలుగు అధ్యయన శాఖ అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ లక్ష్మణచక్రవర్తి ప్రారంభోపన్యాసం చేశారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం నెల్లూరు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ మాట్లాడుతూ.. శాస్త్ర గ్రంథాలను చదివితే మన ప్రాచీనులు మనకందించిన శాస్త్రీయ అంశాలు తెలుస్తాయన్నారు. పావులూరి మల్లన గణితశాస్త్ర సంగ్రహనం, నాడీనిదానం, నేత్ర దర్శనం తదితర గ్రంథాల్లో శాస్త్రీయ అంశాలు దాగున్నాయన్నారు. ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. శస్త్రం, శాస్త్రం, కావ్యం.. ఈ మూడూ కావ్యానికి ఆలంబనాలని పేర్కొన్నారు. తెయూ రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ.. సాహిత్యంపై ఇంకా పరిశోధనలు జరగాలని, ఇటువంటి సదస్సులు మరిన్ని నిర్వహించాలని కోరారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి, ఆత్మీయ ప్రొఫెసర్లు పి కనకయ్య, కమలాకరశర్మ, కేఎస్‌వీవీ. సూర్యనారాయణ మూర్తి, డాక్టర్ గోలిపెంచల ప్రసాద్, కోయి కోటేశ్వర రావు తదితరులున్నారు.

అర్హులందరికీ ఆరు గ్యారంటీలు

- గత ప్రభుత్వ హయాంలో ప్రజాధనం వృథా అయ్యింది
- ఎన్నికలప్పుడే రాజకీయాలు.. మిగతా సమయంలో అభివృద్ధే ప్రధానం
- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



ఎరాజ్‌పల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బోధన్‌రూరల్/బోధన్/రెంజల్: అర్హులైన ప్రతిఒక్కరికీ ఆరు గ్యారంటీలను అందిస్తామని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం బోధన్ మండలంలోని ఎరాజ్‌పల్లిలో నిర్మించిన జీపీ భవనాన్ని ప్రారంభించి 250 మెట్రిక్ టన్నుల సొసైటీ గోదాం, అంగన్ వాడీ కేంద్రం పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే రెంజల్ మండలం సాటాపూర్‌లో గృహజ్యోతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎరాజ్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రజాధనం వృథా అయిందన్నారు. ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పనుల్లో నాణ్యత కరువైందన్నారు. ఎన్నికల సమయంలోనే పార్టీలు, రాజకీయాలు చూడాలని, ఇప్పుడు అభివృద్ధికి కృషి చేయలన్నారు. త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. నియోజకవర్గంలో ఎక్కడైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యాన్ని సేవిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.

రైతుల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

రైతులను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తానని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. తన హయాంలో అలీసాగర్ బ్యాక్ వాటర్‌తో బెల్లాల్‌కు నీటిని తీసుకొచ్చి తాగు, సాగు నీటి అవసరాలను తీర్చానని గుర్తుచేశారు. రానున్న కాలంలో నిజాంసాగర్ కాలువలకు పూడికలు తీసి రైతులకు సాగు నీటి కష్టాలు లేకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. రెంజల్ పరిధిలో ఎన్‌ఎస్‌ఎఫ్ భూముల్లో ఉన్న గందరగోళాన్ని సరిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. అందుకోసం ప్రతీ గ్రామంలో రెవెన్యూ అధికారులు సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధరణిలోని పొరపాట్లను సరిదిద్దుతున్నట్లు వివరించారు. అనంతరం సాలూర, బోధన్ మండలంలోని వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆహ్వానించారు. అలాగే తాడ్‌బిలోలి ఎంపీటీసీ చింతకుంట లక్ష్మీలింగారెడ్డి బీఆర్‌ఎస్‌ను వదిలి కాంగ్రెస్ పార్టీలో చేరారు. జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావ్, ఎంపీపీ బుద్దె సావిత్రి, వైస్ ఎంపీపీ కోట గంగారెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మి, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, మాజీ ఎంపీపీ, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, రెంజల్ మండల అధ్యక్షుడు మొబిన్‌ఖాన్, నాయకులు సాయరెడ్డి, రాములు, ధనుంజయ్, తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



తాడ్‌బిలోలి ఎంపీటీసీని ఆహ్వానిస్తూ..

మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం



నందిపేట్(ఆర్మూర్): నందిపేటలోని కేదారేశ్వర ఆశ్రమంతో పాటు నందీశ్వర ఆలయంలో మంగిరాములు మహరాజ్ ఆధ్వర్యంలో మహాశివరాత్రి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందిరాములు మహరాజ్‌కు భక్తులు తులాభారం వేసి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నవీన్, మచ్చర్ల చిన్న సాయన్న, ప్రసాద్, ఆలయ కమిటీ వైస్ చైర్మన్ కిషన్, కోశాధికారి నడిపి ముత్యం తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

రుద్రూర్: మండలంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం స్థానిక ఎస్సై మహేందర్ పాఠశాలను సందర్శించి పరిసరాలు పరిశీలించారు. పరీక్షకు 159 మంది విద్యార్థులను గాను 152 మంది హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ తెలిపారు.

ధర్నాను విజయవంతం చేయాలి

బాల్కొండ: మండల కేంద్రంలో బుధవారం చేపట్టబోయే ఎల్‌ఆర్‌ఎస్ వ్యతిరేక ధర్నాను విజయవంతం చేయాలని బాల్కొండ నియోజకవర్గ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మంగళవారం పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 25 లక్షల ఎల్‌ఆర్‌ఎస్ లబ్ధిదారులపై రూ.20 కోట్ల భారం పడేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా భారీ ధర్నా, నిరసన కార్యక్రమాన్ని బాల్కొండ బస్టాండ్ వద్ద నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రూ.50 వేల విరాళం



దాతను సన్మానిస్తున్న గ్రామస్తులు

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం నిర్మాణానికి గ్రామానికి చెందిన కొమ్ముల సంకేత్‌రెడ్డి తన వంతుగా రూ.50 వేల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయనను స్టేడియం నిర్మాణ బాధ్యులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. దాతలు ముందుకు వచ్చి నిర్మాణానికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో కబడ్డీ అసోషియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధర్, రిటైర్డ్ ఉపాధ్యాయులు అంజయ్య, పుష్పనాథ్‌రెడ్డి, గోపినాథ్, గ్రామస్తులు సాయన్న, గంగారెడ్డి, గంగారాం, ముస్కు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 -	మా ఊరి రాజారెడ్డి - 10.30 వ్యూహం (తెలుగు) - 1.00 ఊరు పేరు భైరవకోన - 3.45 ముఖ్య గమనిక (తెలుగు) - 7.00 కిక్ (తెలుగు) - 9.45
స్క్రీన్-2 -	ఆపరేషన్ వాలెంటైన్ (తెలుగు) - 12.15, 3.10, 6.05, 9.00
స్క్రీన్-3 -	ఊరు పేరు భైరవకోన (తెలుగు) - 12.45, 10.00 హనుమాన్ (తెలుగు) - 3.45 ఆపరేషన్ వాలెంటైన్ (తెలుగు)-7.05
స్క్రీన్-4 -	ఇంటి నెంబర్ -13 - 10.45 చారి-111(తెలుగు) - 1.30, 7.20 భూతద్దం భాస్కర్ - 4.20, 10.10

ఉర్దూ అకాడమీ చైర్మన్‌కు శుభాకాంక్షలు



బోధన్: జిల్లాకు చెందిన టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్ బిన్ హందాన్ ఇటీవల తెలంగాణ ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా నియమితులైన విషయం తెలిసిందే. మంగళవారం ఆయన హైదరాబాద్‌లోని అకాడమీ ఆఫీసులో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బోధన్‌కు చెందిన కాంగ్రెస్ మైనార్టీ నాయకులు తరలి వెళ్లి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు.

అర్హులకు జీరో విద్యుత్ బిల్లు రావడం లేదు

వేల్పూర్: అంక్సాపూర్‌లో తెల్లరేషన్‌కార్డు కలిగి, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు జీరో విద్యుత్తు బిల్లు రావడం లేదని స్థానిక బీఆర్‌ఎస్ నాయకుడు మిట్టపల్లి మహిపాల్ మంగళవారం ఆరోపించారు. తెల్లరేషన్‌కార్డు ఉన్న వారికి గృహజ్యోతి అందిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ గ్రామంలో అమలు కావడం లేదన్నారు. 200 యూనిట్ల లోపు విద్యుత్‌కు బిల్లు మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా, తమ గ్రామంలో అంతలోపు యూనిట్ల విద్యుత్ ఖర్చు చేసినా బిల్లు వేశారన్నారు.